# ఖాళీ కుర్చీ

వెండి కొండల్లోని కైలాసపర్వతం పార్వతీ పరమేశ్వరుల నివాసమయితే భాగ్యనగరంలోని బంజారకొండలు సంపన్నుల నివాసం.

బంజార కొండల్లో ఒక ఎత్తైన నల్లరాతి కొండ. ఆ నల్లరాతి కొండమీద దంతపు మేడలా మెరిసే ఒక తెల్లని భవనం. దానిని పోయేవారికి ఒక్కక్షణం ఆగి చూడాలనిపించేటంత అందమైన భవనం అది.

అది రిటైర్డ్ మేజర్ అశోక్ భవన్.

సూర్యుడు అస్తమించే వేళకు మేజర్ అశోక్, అతని భార్య మంజుల పోర్టికోలో ఉదయిస్తారు. ఇద్దరూ చెరో కేన్ ఛైర్‌లోను కూర్చుంటారు. మేజర్ అశోక్ డెబ్బైవసంతాలు చూసాడు. అతని భార్య మంజుల అతనికంటె ఐదు సంవత్సరాలు తక్కువ చూసి వుంటుంది. ప్రతి సాయంత్రం ఆ బాల్కనీలో వారిద్దరూ మౌనంగా కూర్చుని వుంటారు. వర్షాకాలంలోను, చలికాలంలోను ఉన్ని బట్టలు వేసుకుంటారు. వేసవికాలంలో పల్చని తెల్లటి గ్లాస్కో బట్టలు ధరిస్తారు.

సూర్యాస్తమయం తర్వాత అలా ఇద్దరూ బాల్కనీలో కూర్చుని రాత్రి పదిగంటల దాకా కాలం గడుపుతారు. వారు కాలం గడిపే తీరు చూసేవాళ్ళకు చిత్రంగా వుంటుంది. ఒకరితో ఒకరు మాట్లాడుకోరు.

మేజర్ అశోక్ దిగంతంలోకి చూస్తూ వుంటాడు. అతని చూపులకు అలసట లేదు. అతని పక్కనే కూర్చున్న మంజుల మేజర్ అశోక్‌నే చూస్తూ వుంటుంది. అతన్ని అలా చూడటంలో ఆమెకూడా ఎన్నడూ అలసిపోదు.

వెన్నెల రాత్రులలోను చీకటి రాత్రులలోను కూడా అతను దిగంతంలోకీ, ఆమె అతన్ని చూస్తూనే కాలం గడుపుతారు. చీకటి రాత్రులలో నింగినిండా తారలు, నేలనిండా కనుచూపు మేరవరకూ చుట్టూ తారల్లా మెరిసే దీపాలు ఆ బాల్కని లోనుంచి చూడవచ్చు.

దిగంతంలోకి మేజర్ అశోక్ అలా చూస్తూ వుంటే అతని వాడిచూపులు గురిపెట్టిన మెషీన్‌గన్స్‌లా అనిపిస్తాయి ఆమెకు. అతనలా దిగంతంలోకి చూడటంవల్ల నింగిలో మారే రంగులు, రంగు రంగుల దీపాలు, ఏర్‌పోర్టులో లాండ్ అవుతున్న విమానాలు, ఏర్‌పోర్టు నుంచి గాలిలోకి తేలిపోతున్న విమానాలు – అతనికి అగుపిస్తాయి అనుకోవచ్చు.

కాని ఆమె అత న్నేమాటామంతీ లేకుండా అలా చూస్తూ వుండడంవల్ల అతనిలో ఆమెకు ఏమి కొత్తదనాలు కనుపిస్తున్నాయో, వాళ్ళిద్దరినీ చూసే వాళ్ళకు

తెలియదు. కాని అతనిలో ఆమె చూసేదేమిటో ఆమెకే తెలుసు. ఆమె అతనితో నలభై ఐదేళ్ళు కాపురం చేసింది. అతన్ని కొత్త పెళ్ళికొడుకుగాను చూసింది. నడివయస్కుడిగాను చూసింది ఇప్పుడు కాస్త నడుంవంగిన వాడుగానూ చూస్తోంది. అతనిలో – ఒకనాడు కొత్తపెళ్ళికొడుకుని, తండ్రిని, ఇప్పటి తాతనీ చూస్తుంది. అతనిలో... వారిరువురి జీవితపు హరివిల్లు రంగుల మార్పులను చూస్తుంది. నెలకో రెండు నెలలకో ఒకసారి మాట్లాడుకుంటారు వారిద్దరూ. బహుశా పైలట్ ఆఫీసరుగా పనిచేస్తున్న పెద్దకొడుకు దగ్గరనుంచో, ఆర్మీలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న చిన్నకొడుకు దగ్గరనుంచో ఉత్తరాలు వచ్చినప్పుడు – పెదవి విప్పి మాట్లాడుకుంటారు.

"పెదబాబు రాసిన లెటరు చదివావా!" అంటాడు అతను.

"ఆఁ కోడలుకు పురుడు వచ్చిందట. మగపిల్లవాడట. అచ్చు మీ పోలికేనట." అంటుంది ఆమె.

"ఒకసారి వెళ్ళి చూసొస్తావా!"

"నే వెళితే మీరో!"

"పోనీ నేను వెళ్ళిరానా!"

"ఆఁ వెళ్ళి చూసిరండి, పాపం!"

"మరి నే వెళితే నువ్వో!" అంటాడు అతను.

ఇద్దరూ నవ్వుకుంటారు.

"వాళ్ళే వస్తార్లెండి సెలవు దొరికినప్పుడు, అప్పుడే చూడొచ్చు మనవడ్నీ, కోడల్నీనూ" అంటుంది ఆమె.

మళ్ళీ పైప్ పీలుస్తూ – దీపాల మీద నుంచీ, తారల క్రిందనుంచీ అతను దిగంతంలోకి చూస్తూ బొమ్మలాగా వుండిపోతాడు. పైపు ఖాళీ అయినప్పుడు పైపును కుర్చీ హేండ్‌మీద టక్! టక్!! అని రెండుసార్లు కొడతాడు.

టొబాకో టిన్ అందిస్తుంది ఆమె.

పైపు టొబాకోతో నింపుకుని మళ్ళీ ముట్టిస్తాడు.

చీకటితోటే అతనే – స్వయంగా మిల్క్ బాటిల్స్ మిల్క్ బూత్‌నుంచి తెచ్చుకుందుకు బయలుదేరతాడు. అతను పిలవకుండానే ఇంటికి తాళం వేసి ఆమె కూడా అతనివెంట వెళ్తుంది. సాయంత్రపు వేళ ఆమె బాస్కెట్ తీసుకుని కూరలకు బయలుదేరుతుంది. అతను ఆమెవెంట ఆమె పిలవకుండానే వెళతాడు.

అనుక్షణం ఇద్దరూ కలిసే వున్నా, వారు మాట్లాడుకునే మాటలు వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

ఒకసారి అతన్ని పొరిగింటి దాస్ నవ్వుతూ "వాట్ మిస్టర్ అశోక్! బాల్కనీలో నువ్వు మీ ఆవిడా గంటల తరబడి రోజూ కూర్చుంటారు. ఏం మాట్లాడుకుంటారు? పోనీ! క్లబ్బుకి రాకూడదూ!" అన్నాడు.

"నలభై ఐదేళ్ళుగా యిద్దరం మాట్లాడుకుంటూనే వున్నాం. ఇంకా ఏం మిగిలింది మాట్లాడ్డానికి. అలాగే క్లబ్బుకి వచ్చేవాడ్ని. అక్కడ మాత్రం క్రొత్తదనమేముంది! నిశ్శబ్దంలోనే నేనేదో తృప్తిని ఫీలవుతున్నాను." అన్నాడు అశోక్.

"ఒక్కొక్క మనిషికి ఒక్కొక్క అభిరుచి!" అన్నాడు నవ్వుతూ దాస్.

"అంతేకాదు! ఒక్కొక్క వయస్సులో ఒక్కొక్క అభిరుచి!" అన్నాడు అశోక్.

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఆరోజు సాయంత్రం ఎప్పటిలాగే బాల్కనీలో - కుర్చీలో కూర్చుని పైప్ పీలుస్తూ, దీపాలకీ తారలకీ మధ్య నుంచి దిగంతంలోకి చూస్తున్నాడు - రిటైర్డ్ మేజర్ అశోక్.

పైప్‌లోంచి పొగ రావడం మానేసింది.

పైప్ ఖాళీ అయింది.

కుర్చీ హేండ్ మీద టక్! టక్!! అని పైపును కొట్టాడు. టొబేకో టిన్ అందివ్వలేదు ఆమె.

దిగంతం నుంచి అతని చూపుల్ని మళ్ళించి పక్కనేవున్న ఆమెవైపు చూసాడు.

కానీ కుర్చీలో ఆమె లేదు.

కుర్చీ ఖాళీగా వుంది.

అంతక్రితం రోజునే ఆమె చనిపోయిందన్న సంగతి ఖాళీకుర్చీ చూసేదాకా అతనికి గుర్తులేదు.

★ ★ ★